## ఈశాన్య ఉక్రేన్ యుద్ధంలో రష్యా పైచేయి


### జెలెన్స్కీ ఆందోళన




**మాస్కో :** ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధం మూడు నాలుగు రోజులుగా మరింత ఉధృతరూపం దాల్చింది. దక్షిణ ఉక్రేన్‌లో రష్యా చేసిన గగనతల దాడుల్లో 17 మంది గాయపడ్డారు. ఈశాన్య ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధంలో రష్యా పైచేయి సాధించింది. దీంతో ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆందోళనలో పడ్డారు. విదేశీ పర్యటనలు కూడా వాయిదా వేసుకున్నారు. ఖార్కీవ్ ప్రాంతం నుండి 8,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గడచిన 24 గంటల్లో 1,200 మంది సైనికులను ఉక్రేన్ కోల్పోయిందని రష్యా రక్షణమంత్రిత్వశాఖ బుధవారం ప్రకటించింది. మూడు యుద్ధ టాంకులను, కంబాట్ వెహికిల్స్‌ను ధ్వంసం చేశామని, ఉక్రేన్ వైమానిక వ్యవస్థకుచెందిన మిగ్–29 యుద్ధ విమానాన్ని కూడా ధ్వంసం చేశామని ప్రకటించింది. కాగా అదేసమయంలో ఉక్రేన్ దేశాధ్యక్షుడు జెలెన్స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఆయుధాలు సత్వరం సరఫరా చేయాలని ఉక్రేన్‌లో ఆకస్మిక పర్యటన చేసిన అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్‌కు విజ్ఞప్తి చేశారు. ఉక్రేన్‌కు మరో రెండు బిలియన్ డాలర్ల అదనపు సహాయం చేస్తామని బ్లింకెన్ కీవ్ పర్యటనలో ప్రకటించారు. ఈ దశలో ఇప్పటికే ఆరు ఉక్రేన్ గ్రామాలను స్వాధీనం చేసుకున్న రష్యా బుధవారంనాడు మరో గ్రామాన్ని స్వాధీనం చేసుకుందని రష్యా రక్షణమంత్రిత్వశాఖ ప్రకటించింది. జపోరోఝియా రాష్ట్రం పోలోగొవ్‌స్కీ జిల్లాలోని రబోటిన్ అనే పేరుగల చిన్న గ్రామాన్ని రష్యా సైన్యం స్వాధీనం చేసుకుంది. ఈ గ్రామం కోసం ఏడు నెలలుగా ఉక్రేన్–రష్యా సేనలమధ్య పోరాటం జరుగుతోంది. ఝురైకా, గ్లుబోకో, లిప్సీ, వోల్చాన్స్క్ ప్రాంతాలలో వందలాది సైనికులు కూడా రష్యా సైన్యం కాల్చివేసింది. ఖార్కీవ్ ప్రాంతంలోని మరో రెండు ప్రదేశాలను కూడా రష్యా సైన్యం స్వాధీనం చేసుకుంది. ఉత్తర,దక్షిణ, తూర్పు, పశ్చిమ దిక్కులలో మోహరించిన రష్యా సైన్యం ముందుకు వెళుతోందని తెలిపింది.

## జైలు అధికారుల నిరసనలతో అట్టుడికిన ఫ్రాన్స్

### కిక్కిరిసిన జైళ్లు : నేరస్తుల వీరవిహారం

**పారిస్ :** జైళ్ళన్నీ ఖైదీలతో నిండిపోయినవి. ఖైదీలు సమస్యలు సృష్టిస్తున్నారనీ, హింసాకాండకు పాల్పడుతున్నారని మొత్తుకుంటున్న ఫ్రాన్స్‌దేశ జైళ్ళశాఖ అధికారులు బుధవారంనాడు పెద్ద నిరసన ప్రదర్శన చేశారు. దీనికి తక్షణం పరిష్కార చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నోర్మండీ మోటర్ హైవే లో భారీ భద్రతమధ్య ఖైదీలను తీసుకువెళుతున్న వాహనంపై ఒక ఆగంతకుడు టోలోగేట్ పాయింట్ వద్ద దాడిచేసి ఇద్దరు జైలు అధికారులను కాల్చి చంపి డ్రగ్స్ కేసులో నేరస్తుడైన ఇద్దరు ఖైదీలను విడిపించుకుని తీసుకుపోయాడు. ఈ ఘటన మంగళవారంనాడు జరిగింది. ఈ కాల్పుల్లో ప్రిజన్ ఆఫీసర్లు ఫాబ్రిస్ మొయిల్లో, ఆర్నోడ్ గార్సియాలు మరణించారు. మరో ముగ్గురు పోలీసులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని మే 14న ఫ్రెంచ్ ప్రధానమంత్రి గాబ్రియేల్ అత్తల్ పార్లమెంటులో ప్రకటించారు. ఈ ఘటన తర్వాత జైళ్ళశాఖలో పనిచేసే వందలాదిమంది అధికారులు, సిబ్బంది వీధుల్లోకి వచ్చారు. నిరసన ప్రదర్శనలు జరిపారు. ఫ్రాన్స్ దేశవ్యాప్తంగా జైళ్ళవద్ద సంబంధిత శాఖాధికారులు, సిబ్బంది ప్రవేశమార్గాలలో రాకపోకలను అడ్డుకుని నిరసన ప్రదర్శనలు జరిపారు.

# ఇజ్రాయిల్‌కు 100 కోట్ల డాలర్ల అమెరికా ఆయుధాలు

### పునరాలోచనలో బైడెన్ యంత్రాంగం




**టెల్‌అవీవ్ :** ఇజ్రాయిల్ విషయంలో పూటకో మాట, గంటకో వైఖరి ప్రదర్శిస్తున్న అమెరికా తాజాగా నేతన్యాహూ ప్రభుత్వానికి 100 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలను సరఫరా చేసే విషయాన్ని పరిశీలిస్తున్నది. నిన్నటివరకూ ఇజ్రాయిల్‌కు ఆయుధాలు సరఫరా చేసే ప్రసక్తే లేదని చెబుతూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇజ్రాయిల్ 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పంపిన సందేశంలో ఇజ్రాయిల్ రక్షణకు ఉక్కు కవచంలా అమెరికా నిలబడుతుందనీ, తన బొందిలో ఊపిరి ఉన్నంతవరకూ తాను ఇజ్రాయిల్ పక్షం వహిస్తానని ప్రకటించిన బైడెన్ పాలనాయంత్రాంగం కొత్తగా ఆయుధాలు పంపేవిషయాన్ని పరిశీలిస్తున్నది. బాహ్యప్రపంచం పూర్తిస్థాయిలో ఇజ్రాయిల్‌ను ఒక దుష్టశక్తిగా పరిగణించి తీవ్రంగా వ్యతిరేకిస్తుండగా ఆ వ్యతిరేకతను తట్టుకోలేక నెతన్యాహూనొక్కరినే నొక్కుతూ పూటకో ప్రకటన చేయడం వివాదాస్పదంగా మారింది. అమెరికా అసలు రంగును బయటపడేసింది. ఇజ్రాయిల్ సంపూర్ణ రక్షణకే అమెరికా కట్టుబడి ఉందని బైడెన్ నిర్ద్వంద్వంగా ప్రకటించారు. ఇజ్రాయిల్‌కు ఒక 100 కోట్ల డాలర్లకు పైగా విలువైన కొత్త ఆయుధాలను విక్రయించాలని భావిస్తున్నట్లు బైడెన్ యంత్రాంగం బుధవారంనాడు కాంగ్రెస్‌కు సూచనాప్రాయంగా తెలియజేసింది. కొద్ది వారాల క్రితం భారీ ఆయుధాలతో కూడిన షిప్‌మెంట్‌ను ఇజ్రాయిల్‌కు పంపే విషయాన్ని పునరాలోచించి జాప్యం చేసి ఆపేసిన అమెరికా ఇప్పుడు కొత్త రాగం అందుకుంటున్నది.

**ఐడిఎఫ్ దాడుల్లో 40 మంది పాలస్తీనియన్ల మృతి**

పాలస్తీనాపై ఇజ్రాయిల్ ప్రారంభించిన యుద్ధం బుధవారంనాటికి 222వ రోజుకు చేరుకుంది. తాజాగా రఫాలో జరిపిన దాడుల్లో 40 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఒక హిజ్బుల్లా ఉగ్రవాదిని కూడా మట్టుపెట్టినట్లు ఐడిఎఫ్ ప్రకటించింది. ఈనెల 3వ తేదీ నుండి ఇప్పటివరకూ తూర్పు రఫా నుండి 4,50,000 మంది పాలస్తీనా ప్రజలు భయంతో ఆ ప్రాంతాన్ని వదిలి మరో ప్రాంతానికి పారిపోయారు. గాజాలో గత ఏడాది అక్టోబరు 31న ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించి 3.80 లక్షల ఇళ్ళను నేలమట్టం చేయడంతో 20 లక్షలమంది పాలస్తీనియన్లు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్ళిపోయారు. వీరిలో చాలామందిమరణించగా, 15 లక్షలమంది రఫాలో తలదాచుకున్నారు. ఇప్పుడు రఫాలో కూడా వారికి మనుగడ లేదు.

**చర్చలు స్తంభించాయి : ఖతార్ వెల్లడి**

రఫాలో ఇజ్రాయిల్ దాడుల కారణంగా కైరో వేదికగా జరుగుతున్న శాంతి చర్చలు పూర్తిగా స్తంభించాయని ఖతార్ ప్రభుత్వ మధ్యవర్తులు ప్రకటించారు. ఈ దాడులే అతిపెద్ద ఆటంకంగా ఉన్నాయని, దీనివల్ల ఇక ఇప్పటివరకూ జరిగిన ప్రయత్నాలు ముందుకు సాగకుండా స్తంభించిపోయాయని ఖతార్ మధ్యవర్తి ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. గడచిన కొద్దివారాలుగా పరిస్థితులు చాలా అనుకూలంగా మారాయనీ, హమాస్ కూడా సవరించిన శాంతి ప్రతిపాదనలకు అంగీకారం తెలియజేసిందనీ, కానీ పరిస్థితులు ఎదురు తిరగడంతో చర్చలు దాదాపు స్తంభించాయని మహ్మద్ బిన్ అబ్దుల్ రహ్మాన్ బుధవారంనాడు ప్రకటించారు. యుద్ధం ఆపుతారా? లేదా? అనే విషయంపై ఇజ్రాయిల్ వైపు నుండి ఎలాంటి స్పష్టతా లేదని ఆయన అన్నారు. కాగా ఖతార్ విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి విడిగా పత్రికాగోష్టిలో మాట్లాడుతూ, మే 9వ తేదీ నుండి గాజాలో ప్రజలకు ఏ విధమైన ఆహార సహాయం, సరఫరాలు జరగడంలేదని చెప్పారు.

## ఫ్రెంచ్ వలస న్యూ కలెడోనియాలో అల్లర్లు




### ముగ్గురు మృతి వందల మందికి గాయాలు

**నౌమియా :** ఫ్రెంచ్ వలసప్రాంతం న్యూ కలెడోనియాలో బుధవారం చెలరేగిన నిరసన ప్రదర్శనలు హింసాత్మకరూపం దాల్చాయి. ఈ ఘర్షణలో ముగ్గురు మరణించారు. వందలాదిమంది గాయపడ్డారు. 130 మందిని మున్సిపల్ పోలీసులు అరెస్టు చేశారు. గడచిన 30 ఏళ్ళలో ఎన్నడూలేన విధంగా మళ్ళీ న్యూ కలెడోనియాలో హింస చెలరేగింది. దీంతో స్కూళ్ళు, కార్యాలయాలన్నీ స్తంభించాయి. రాజధాని నౌమియాలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. న్యూ కలెడోనియాలో ప్రదర్శనలు జరగక్కుండా కర్ఫ్యూ విధించారు. ఇద్దరు వ్యక్తులు మించి ఎక్కువమంది గుమిగూడటాన్ని నిషేధించింది.ఓటింగ్ చట్టంపై సంస్కరణలకు ఫ్రాన్స్ పార్లమెంటు ప్రతిపాదనలు చేయడంతో న్యూ కలెడోనియాలో నిరసనలు వెల్లువెత్తాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ఈ విషయంపై చర్చించేందుకు తక్షణం మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఫ్రాన్స్‌లో పుట్టి నూకలెడోనియాలో పది సంవత్సరాలుగా జీవిస్తున్న వారికి అక్కడి స్థానిక ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించే విషయంపై రాజ్యాంగ పరమైన సంస్కరణలు తెచ్చేవిషయంపై ఫ్రాన్స్ పార్లమెంటు చర్చిస్తున్నది. దీనిని వ్యతిరేకిస్తూ న్యూ కలెడోనియాలో నిరసన ప్రదర్శనలు ఘర్షణలుగా మారి అవికాస్తా హింసాత్మకంగా మారాయి. ఈ సంక్షోభంపై చర్చించేందుకు ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు మేక్రాన్ ఒక సమావేశం ఏర్పాటు చేశారు. చిరకాలంగా న్యూ కలెడోనియాలో జీవిస్తున్న భూమిపుత్రులకు ఈ కొత్త ఓటింగ్ హక్కు సవరణ చర్యలు తీవ్ర విఘాతంగా మారతాయని, వారి హక్కులను పలుచన చేస్తాయనీ ఇండిపెండెన్స్ అనుకూల శక్తులు వాదిస్తున్నాయి. ఫ్రెంచ్ పార్లమెంటు ఈ ఓటింగ్ సంస్కరణలపై తుది విడత బిల్లు ఆమోదం గురించి వచ్చేనెలలో సమావేశం అవుతుంది. ఈ లోపు న్యూ కలెడోనియాలో స్వాతంత్ర్య అనుకూల, వ్యతిరేక వర్గాలతో చర్చలు జరపాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ నిర్ణయించారు. నెపోలియన్ కాలం నుండీ నూ కలెడోనియా ఫ్రాన్స్‌కు వలసప్రాంతంగా ఉంటున్నది. ఫ్రాన్స్‌కు 17,000 కి.మీదూరంలో ఫసిఫిక్ మహాసముద్రం నైరుతీప్రాంతంలో ఉన్న న్యూకలెడోనియా దీవుల తరపున ఫ్రాన్స్ పార్లమెంటులో కూడా ప్రాతినిధ్యం ఉంది. న్యూ కలెడోనియా ప్రజలకు ఫ్రాన్స్‌దేశీయులతో సమానంగా ఓటు హక్కు ఉంది. ఈ విషయంలో సంస్కరణలు ప్రభుత్వం ప్రతిపాదించింది.

### ఇజ్రాయిల్ హింసాకాండకు గూగుల్ వత్తాసు!

## 'ప్రాజెక్టు నింబస్' రద్దుకు మౌంట్ వ్యూలో భారీ ప్రదర్శన




**మౌంట్ వ్యూ:** 'ప్రాజెక్ట్ నింబస్'కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. పాలస్తీనియన్లపై గాజా, రఫా ప్రాంతాలలో ఇజ్రాయిల్ సామూహిక హత్యాకాండ కొనసాగించడానికి ఐడిఎఫ్ (ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్స్)కు "ప్రాజెక్టు నింబస్" ద్వారా గూగుల్ వత్తాసు పలుకుతోందనీ, వెంటనే ఆ ప్రాజెక్టును రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిరసన ప్రదర్శన జరిగింది. గూగుల్‌లో పని చేసే ప్రస్తుత ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు, పాలస్తినా అనుకూల మానవహక్కుల కార్యకర్తలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. కాలిఫోర్నియా రాష్ట్రం శాంతాక్లారా కౌంటీ లోని మౌంట్ వ్యూ నగరంలో గూగుల్ కాన్ఫరెన్స్ సందర్భంగా సదస్సు జరిగే సభా భవనం ప్రవేశ ద్వారం వద్ద నిరసన ప్రదర్శకులు గుమిగూడారు. సదస్సులో పాల్గొనే వారిని లోనికి వెళ్ళనీయకుండా అడ్డుకోవడంతో సదస్సుకు వచ్చిన ప్రముఖులు, సభ్యులు ఆ ద్వారాన్ని వదలి మరో ప్రవేశమార్గం ద్వారా లోనికి ప్రవేశించారు. ప్రాజెక్టు నింబస్ ద్వారా గూగుల్ పాలస్తీనియన్ల సామూహిక హత్యాకాండకు సహాయం చేస్తోందని నిరసన ప్రదర్శకులు నినాదాలు చేశారు. తక్షణం ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని వారు నినాదాలు చేశారు. పాలస్తినా అనుకూల, ఇజ్రాయిల్ వ్యతిరేక ప్రదర్శకులు వందలాదిమంది ఈ సదస్సు జరిగే భవంతి ప్రవేశ ద్వారా వద్ద గూగుల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీసెస్ ద్వారా పాలస్తీనియన్ల సామూహిక హత్యాకాండ సాగించేందుకు ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్స్‌కు సహాయం చేసేవిధంగా 1.2 బిలియన్ డాలర్లతో గూగుల్, అమెజాన్ కంపెనీలు రెండూ చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని, ప్రాజెక్టు నింబస్‌ను వెంటనే ఆపేయాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ యుద్ధం కోసమే ప్రత్యేకంగా గూగుల్ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసిందని ప్రదర్శకులు నిరసన తెలియజేశారు. గత నెలలో కూడా గూగుల్‌లో పని చేసే ఉద్యోగులు పెద్ద సంఖ్యలో విధులను బహిష్కరించి వీధుల్లోకి వచ్చి "ప్రాజెక్టు నింబస్"ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యూయార్క్, కాలిఫోర్నియా నగరాలలో నిరసన ప్రదర్శనలు జరిపారు. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన గూగుల్ యాజమాన్యం ఇందుకు ప్రధాన బాధ్యులైన 28 మంది ఉద్యోగులను విధులనుండి తొలగించింది. కాగా గతవారంలో కూడా మరో 20 మంది ఉద్యోగులను విధుల నుండి యాజమాన్యం తొలగించిందని ఉద్యోగులు చెప్పారు.

## భవనాలు స్వాధీనం (మొదటి పేజీ తరువాయి)

చేయాలని సిఎం ఆదేశించారు. రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదిరిన వాటిని పరిష్కరించుకోవాలని, పీటముడి పడిన అంశాలపై తెలంగాణ ప్రయోజనాలను కాపాడేలా తదుపరి కార్యాచరణ చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి అప్రమత్తం చేశారు. పదేండ్లు పూర్తవనుండటంతో పునర్విభజన చట్టం ప్రకారం ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ కేవలం తెలంగాణ రాష్ట్ర రాజధానిగా మారనుంది. ఈ పదేండ్ల కాలానికి ఏపికి కేటాయించిన లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ వంటి భవనాలను జూన్ 2 తర్వాత రాష్ట్ర అధీనంలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పునర్విభజన చట్టం ప్రకారం పెండింగ్‌లో ఉన్న అంశాలు, ఇప్పటివరకు రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయంతో పంపిణీ చేసుకున్న వివరాలపై సమగ్రమైన నివేదికను తయారు చేయాలని ఆదేశించారు.

## ఇసి సీరియస్ (మొదటి పేజీ తరువాయి)

హింసాత్మక ఘటనలపై వివరణ కోరింది. వ్యక్తిగతంగా వివరణ ఇవ్వాలని సిఎస్, డిజిపిని ఆదేశించింది. హింసాత్మక ఘటనలు జరుగుతాయని ముందే హెచ్చరికలు ఉన్నా పోలింగ్ రోజు అంత నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరించారని ఇసి ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించింది. ఈమేరకు ఇద్దరు అధికారులు ఢిల్లీ వెళ్లి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు వివరణ ఇవ్వనున్నారు. పలనాడులో స్వయంగా పర్యటించిన ఎపి ప్రత్యేక అబ్జర్వర్ రామ్మోహన్ మిశ్రా ఈ అంశాలను నేరుగా సిఇసికి నివేదించారు.

## అరెస్టు చెల్లదు (మొదటి పేజీ తరువాయి)

పురకాయస్థ, చక్రవర్తి దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. ఉగ్రవాద వ్యతిరేక చట్టం 'ఉపా' కింద తనను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ చక్రవర్తి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను ఇప్పటికే ఉపసంహరించుకున్నారు. చైనా అనుకూల ప్రచారం భారతదేశంలో చేయడం కోసం ఆ దేశం నుండి న్యూస్‌క్లిక్ నిధులు పొందిందని ఉపా చట్టం కింద చేసిన ఆరోపణల కేసులో చక్రవర్తి అప్రూవర్‌గా మారడానికి ఢిల్లీ కోర్టు అనుమతించింది. ఢిల్లీ పోలీస్ తరపున ధర్మాసనం ఎదుట హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు ఈ తీర్పు అనంతరం మాట్లాడుతూ, ప్రస్తుతం ఈ అరెస్టు చెల్లదని కోర్టు చెప్పినప్పటికీ, దిద్దుబాటు ద్వారా అరెస్టు చేయడానికి సరైన అధికారాలను ఉపయోగించడానికి ఈ తీర్పు పోలీసులకు ఎలాంటి ఆటంకం కలిగించదని అన్నారు.

## కాయ్.. రాజా కాయ్..!

(మొదటి పేజీ తరువాయి)

బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్‌లు కడుతున్నారు. ఈ సైట్లలో నిర్వాహకులు కొన్ని టార్గెట్లను ఇచ్చారు. వాటిని సభ్యులు ఎంచుకుని ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. దేశంలోని ఆయా రాష్ట్రాలలో బిజెపి, కాంగ్రెస్‌కు ఎన్నెన్ని సీట్లు వస్తాయి, రావు అంశాలను కూడా సైట్లలో పెట్టారు. ఇక తెలంగాణ విషయానికి వస్తే నిర్వాహకులు బిజెపికి ఆరు సీట్లు రావని, ఏడు వస్తాయని అంశాలను పెట్టారు. ఇందులో సభ్యులు ఏదైనా అంశాన్ని ఎంచుకుని బెట్టింగ్ పెట్టాల్సి ఉంటుంది. అలాగే తెంగాణలో కాంగ్రెస్‌కు ఎనిమిది సీట్లు రావని, తొమ్మిది సీట్లు వస్తాయి అనే అంశాన్ని కూడా పెట్టారు.అందులో ఏది ఎంచుకున్నా గెలిసిన వారికి వందకు వంద రూపాయలను నిర్వాహకులు ఇస్తారు.

## 14 మందికి పౌరసత్వం

(మొదటి పేజీ తరువాయి)

మారింది. వారికి సిఎఎ కింద పౌరసత్వం ఇస్తామని బిజెపి అంటుంటే, ఇక్కడే స్థిరపడి , అన్ని రకాల ఆధారలు ఉన్నందున వారు సిఎఎ కింద దరఖాస్తు చేసుకోనవసరం లేదని టిఎంసి పేరొకంది. ఈ నేపథ్యంలో మతువా వర్గ ప్రజలు ప్రభావితం చేసే లోక్‌సభ నియోజకవర్గాలకు మే 20న ఎన్నికలు జరగున్న నేపథ్యంలో సిఎఎ కింద తొలిసారిగా 14 మందికి భారతీయ పౌరసత్వం ఇచ్చారు.

# ఎన్నికల అనంతరం విధుల్లోకి సిఎం రేవంత్‌రెడ్డి

### ధాన్యం కొనుగోలు, వానాకాలం సీజన్‌కు విత్తనాలు, ఎరువుల సరఫరాపై దృష్టి

### వ్యవసాయం, విద్య, వైద్య రంగాలలో సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో రెండు దాదాపు రెండు నెలలు బిజిబిజీగా గడిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం పరిపాలనపై దృష్టి సారించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉండడంతో సచివాలయానికి దూరంగా ఉన్న సిఎం ఎన్నికలు ముగియగానే తన అధికారిక పనుల్లో నిమగ్నమయ్యారు. "లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో మెజారిటీ సీట్లు సాధిస్తాం. ఎన్నికలు అయిపోమాయి. రాజకీయాలు, విమర్శలు, ప్రతివిమర్శలు కూడా ముగిశాయి. ఇక పరిపాలనపై దృష్టి సారిస్తాను" అని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ మేరకు బుధవారం సచివాలయానికి వచ్చిన రేవంత్ రెడ్డి వ్యవసాయం, విద్య, వైద్య రంగాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫోకస్ పెట్టి వరుస సమీక్షలు చేశారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిగా మారిపోయిన సిఎం రేవంత్‌రెడ్డి బిజెపి అగ్రనేతలను సవాల్ చేసి, సరికొత్త ప్రచార వ్యూహాలతో కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్ నింపారు. పరిపాలనపై దృష్టి పెట్టిన రేవంత్‌రెడ్డి ధాన్యం కొనుగోళ్లు, వానాకాలం సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు, జలవనరుల పరిస్థితి, భూగర్భజలాలు, రైతులకు ప్రభుత్వం తరుపున అందాల్సిన సాయం అన్నింటిపై సమీక్ష జరిపారు. రైతు సంక్షేమ కార్పోరేషన్ ద్వారా రుణమాఫీ చేసే అంశంపైనా సమీక్షింవచినట్లు సమాచారం. ఉద్యోగ నియామకాలు, కార్పోరేషన్ల ఏర్పాటుపైనా చర్చలు జరిపారు. ముఖ్యమంత్రి తన అధికారిక కార్యకలాపాలు చేపట్టడంతో మంత్రులు కూడా తమ శాఖల పనులు మొదలుపెట్టారు.

## నేడు రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్‌ఎస్ నిరసనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సన్న వడ్ల కు మాత్రమే రూ.500ల బోనస్ చెల్లిస్తామనడం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి వంచించడమేనని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారని,కానీ రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనన్నారు. రైతాంగ హక్కులను, హామీలను సాధించే వరకు బిఆర్‌ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపడుతుందన్నారు. రైతాంగానికి భరోసా కల్పించేదిశగా నిరసన కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ వడ్ల కల్లాలకు వెళ్లాలని, రైతులకు అండగా నిలువాలని కెసిఆర్ తెలిపారు.

## మరో మూడు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో మూడు రోజుల పాటు తేలిక పాటు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. వివిధ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గురువారం కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాల్‌పల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యపేట, మహబూబ్‌నగర్, వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, నిజామాబాద్‌లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 కిలో మీటర్ల నుంచి 50 కిలో మీటర్ల వేగంఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అదేవిధంగా శుక్రవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో, శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అధికారులు వెల్లడించారు.

## రుణమాఫీ చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

మిల్లులు వద్ద ఉన్న ధాన్యం తడిసిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. తాజాగా తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలంటూ కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం కొమలంచ గ్రామంలో రైతులు రోడ్డెక్కారు. గత ఐదు రోజుల నుంచి గ్రామంలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని కామారెడ్డి రైతులు నిరసనకు దిగారు. 40 లారీలకు పైగా ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్లను ఎఫ్‌సీఐ కేంద్రాలకు తరలించి 25 రోజులు గడిచినా ఇంకా తూకం జరగడం లేదని వాపోయారు. అధికారులు వచ్చి తమ సమస్యను పరిష్కరించేంత వరకు కదిలేదంటూ రోడ్డుపై భైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'అలాగే నిర్మల్ జిల్లా మామడ, లక్ష్మణ చందా మండలాల్లో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దయిపోయింది. చేతికొచ్చిన పంట వర్షానికి తడిసి ముద్ద కావడంతో మొలకలొచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలో కొనుగోలు కేంద్రాల ప్రారంభించి మాసం రోజులు గడుస్తున్న పూర్తిగా వరి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న వరి ధాన్యం మొలకెత్తిపోయింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండల పరిధిలో కొనుగోలు కేంద్రం వద్ద నుండి 80 శాతం వరి ధాన్యం తరలించినప్పటికీ 20 ధాన్యం ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్ర వద్ద కొనుగోలు జరగడం లేదు. దీనితో నెలరోజుల నుండి రైతులు కొనుగోల కేంద్రంలో వద్ద రైతులు రాత్రి పగలు పడి కాపులు కాస్తున్నారు. కొనుగోలు ప్రారంభంలో సన్న వరి ధాన్యానికి రైస్ మిల్లర్స్ అదనంగా 300 రూపాయలు రైతులకు చెల్లించారు కానీ, చివరి సమయంలో రైస్ మిల్లర్స్, అసోసియేషన్ సిండికేట్ వ్యవహరించి అదనంగా మద్దతు ధర ప్రకటించవద్దని మిల్లర్స్ నిర్ణయించుకున్నారని రైతుల ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి సన్న వరి ధాన్యానికి అదనంగా మద్దతు ప్రకటిస్తుందని గంపెడు ఆశతో ఎదురుచూస్తూ కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యం నిలువలు అలాగే ఉంచారు. మండల పరిధిలోని రాజ్యా తండా, తమ్మయపల్లి, అరికెల, పోమ్లతాండాలో తో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో ధాన్యం నిల్వలు అలాగే ఉండిపోయాయి. ఒక లారీ రైస్ మిల్ వద్ద ఖాళీ కావడానికి నాలుగైదు రోజులు సమయం పట్టడంతో కొనుగోలు కేంద్రం తూకం వేసిన వరి ధాన్యం బస్తాలు ఎక్కువగా నిలువలు ఉన్నాయని రైతుల ఆరోపిస్తున్నారు.

**జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీ నగర్ మండలం గూడూరులో ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు నత్త నడకన సాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాలు, తేమ పేరుతో అధికారులు వేధిస్తున్నారని ఆవేదన చెందారు. 20 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయటం లేదని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జాతీయ రహదారి 163పై బైఠాయించారు. రైతుల ధర్నాతో హైదరాబాద్‌వరంగల్ వెళ్లే వాహనాలు రోడ్లపై నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అయింది. ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులతో రైతులు వాగ్వాదానికి దిగారు. అధికారులకు చెప్పి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

## విద్యుత్ వైఫల్యాలకు నేను బాధ్యున్ని అనడం విడ్డూరం : హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యుత్ రంగ వైఫల్యాలకు తానే భాధ్యుడన్నట్టుగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. 24 గంటల పాటు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ ఉద్యోగుల సహకారంతో పటిష్ఠమైన వ్యవస్థను నిర్మించామని, రెప్పపాటు కాలం కూడా కరెంట్ కోతలు లేని ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపామని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు, విద్యుత్ ఉద్యోగులపై సిఎం నిరాధార ఆరోపణ చేస్తున్నారన్నారు.

## రాజకీయాలు పక్కనపెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. రైతన్నలు తీవ్ర కష్టాల్లో బాధపడుతున్నారని, రైతులు తమ ధాన్యం ప్రభుత్వం కొనడంలేదనే దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయని, తమ ధాన్యం కొనే నాథుడు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడంలో ఆలస్యం కావడం, అకాల వర్షాలు కురుస్తుండటంతో మొత్తం ధాన్యం వర్షాల పాలవుతోందన్నారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారి లేకపోవడం, కొనుగోలు చేయాలని ఆదేశించే ప్రజాప్రతినిధి లేకపోవడంతో రైతన్నలు తీవ్ర నష్టాల పాలవుతున్నారని తెలిపారు. ఇప్పటకైనా ప్రభుత్వం దాన్యం కొనుగోళ్లలో వేగాన్ని పెంచాలని, ఎట్టి పరిస్థితులలో రైతుకు అన్యాయం చేయకుండా తరుగు లేకుండా రైతన్నలకు న్యాయం చేయాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నాలు, రాస్తారోకోలు నిరసనలు తెలియచేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వం స్పందించకపోతే రైతన్నల కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్లపైన ఎక్కాల్సి వస్తుందని కెటిఆర్ హెచ్చరించారు. రైతులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని వారికి బిఆర్‌ఎస్ అండగా ఉంటుందని హామీనిచ్చారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.3,87,000 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం అప్పు చేసిందని ఆర్‌బిఐ తెలిపిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినట్టు ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పు ఉన్నదని దివాళ కోరు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల పైన తప్పుడు ప్రచారం చేసినందుకు రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఎకరాల్లో పత్తి సాగు (మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ ఈసారి కేంద్ర ప్రభుత్వం బోల్‌గార్డ్ – II రకం పతి విత్తన ప్యాకెట్ గరిష్ట ధరను రూ.864లు గా నిర్ణయించిందని, ఏ డీలరైనా అంత కంటే ఎక్కువ ధరకు అమ్మినా, విత్తన సరఫరాలో ఏ కంపెనీ అయినా ఇబ్బందులు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. జిల్లాల వారీగా తనిఖీ బృందాలు ఏర్పాటు చేసుకుని, ఎప్పటికప్పుడు అమ్మకాలను పర్యవేక్షిస్తూ నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. 2021వ సంవత్సరంలో రాష్ట్రంలో 60.53 లక్షలు ఉన్న పత్తి సాగు విస్తీర్ణం కాగా, క్రమంగా తగ్గుతూ 2023 నాటికి 45.17 లక్షలకు పడిపోయిందన్నారు. అయితే ప్రపంచ మార్కెట్లో పత్తికి పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఈసారి విస్తీర్ణం పెరిగే అవకాశముందని, దానికి తగ్గట్లుగా బిజి–II విత్తనాలను అందుబాటులో ఉంచాల్సిందిగా ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. గతేడాది 90 లక్షల ప్యాకెట్లు అమ్ముడుపోగా, ఈసారి 120 లక్షల ప్యాకెట్లను మార్కెట్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు సంబంధించి ఇప్పటికే రెండు దఫాలు సంబంధిత అధికారులు, విత్తన కంపెనీలతో సమావేశం నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. విత్తన సరఫరా మొదలు, అమ్మకాల వరకు రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే ఏలాంటి చర్యలను ప్రభుత్వం సహించబోదని, విధులపట్ల అలసత్వం వహించిన అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

